క్లుప్తంగా

ఉపాధి కూలీలకు రోజుకు రూ.600 చెల్లించాలి



సిరికొండ: ఉపాధి హామీ పథకంలో కూలీలకు కొలతలు లేకుండానే రోజుకు రూ.600 చెల్లించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి రమేష్ కోరారు. మండలంలోని తూంపల్లి, కొండాపూర్ గ్రామాల్లో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పనులను పరిశీలించి, కూలీల సమస్యలపై సర్వే నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ కూలీల పొట్ట కొడుతూ, సరిగ్గా నిధులు కేటాయించకుండా పథకాన్ని ఎత్తివేసేందుకు కుట్ర పన్నుతోందని విమర్శించారు. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సర్వీస్ పేరుతో మొబైల్ యాప్‌ను ప్రవేశ పెట్టడం వల్ల కార్మికులకు సమస్య మొదలైందన్నారు. ఏడాదికి ప్రతి కూలీకి 250 రోజుల పని కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు దామోదర్, సాయారెడ్డి, రమేష్, కిషోర్, లింబాద్రి, సాయిలు, బాల్‌రెడ్డి, ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం



సిరికొండ: పోత్నూర్ గ్రామంలో జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. శిబిరంలో జబ్బ, గొంతు వాపు వ్యాధులు రాకుండా ఆవులు, గేదెలు, దూడలకు వ్యాధి నివారణ టీకాలను వేశారు. పశు సంవర్ధక శాఖ అధికారి బాబురావు,సహాయకులు శ్రీనివాస్, చంద్రశేఖర్, సతీష్,వీడీసీ సభ్యులు,పాడిరైతులుపాల్గొన్నారు.

హోరాహోరీగా క్యారం పోటీలు



నిజామాబాద్ నాగారం: ఆలిండియా క్యారం పోటీలు జిల్లా కేంద్రంలో హోరాహోరిగా సాగుతున్నాయి. నిజామాబాద్ నగరంలోని దాస్‌నగర్ నవ్య భారతి స్కూల్లో ఆలిండియా వెటరన్ మెన్ అండ్ ఉమెన్ పోటీలు జరుగుతున్నాయి. శుక్రవారం రెండో రోజు పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. కార్యక్రమంలో క్యారం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సంతోష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన కాంగ్రెస్ నాయకులు



సిరికొండ: హైదరాబాద్‌లో రూరల్ ఎమ్మెల్యే రేకులపల్లి భూపతిరెడ్డిని మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు శుక్రవారం కలిశారు. మండలంలో నెలకొన్న సమస్యలపై వారు ఎమ్మెల్యేతో చర్చించారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. జెడ్పీటీసీ మాన్‌సింగ్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు రాజేశ్వర్‌గౌడ్, బాలరాజ్‌నాయక్, మహేందర్ ఉన్నారు.


చోరీకి గురైన ఫోన్ల అందజేత

వర్ని: చోరీకి గురైన ఫోన్లను బాధితులకు అందజేసినట్లు ఎస్సై కృష్ణకుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని పీఎస్‌లో మోస్రా గ్రామానికి చెందిన ముగ్గురి ఫోన్లు గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. దీంతో బాధితులు పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్ ద్వారా ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

విత్తన దుకాణాల తనిఖీ

రుద్రూర్: కోటగిరి మండలంలో ఫర్టిలైజర్, విత్తన దుకాణాలను మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌రావు శుక్రవారం తనిఖీ చేశారు. రైతులకు విక్రయిస్తున్న విత్తనాలను పరిశీలించారు. నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని దుకాణదారులకు సూచించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మురికి కాలువల్లో చెత్త వేయొద్దు



ఆర్మూర్‌టౌన్: ప్రజలు చెత్తాచెదారాన్ని మురికి కాలువల్లో వేయకుండా ఇంటింటికీ వచ్చే మున్సిపల్ సిబ్బందికి అందించాలని రెండో వార్డు కౌన్సిలర్ ఖాందేశ్ సంగీత అన్నారు. పట్టణంలోని రెండో వార్డులో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది చేపడుతున్న పారిశుద్య పనులను కౌన్సిలర్ పరిశీలించారు. ప్రజలు తమ ఇంటి పరిసరాలను శు భ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవని అన్నారు. అధికారులు, సిబ్బంది ఉన్నారు.

సోనియాను ఆహ్వానించడం సరికాదు

- ఆమె తెలంగాణ తల్లి ఎలా అవుతుంది..?
- కాంగ్రెస్ నేతలకు అర్బన్ బీజేపీ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూటి ప్రశ్న



మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, పాల్గొన్న కార్పొరేటర్లు

సుభాష్‌నగర్: తెలంగాణ బలిదేవత సోనియాగాంధీ అన్న సీఎం రేవంత్‌రెడ్డికి నేడు తెలంగాణ తల్లిగా ఎలా కనిపించిందని నిజామాబాద్ అర్బన్ బీజేపీ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ప్రశ్నించారు. శుక్రవారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో వందల మందిని బలి తీసుకున్న బలి దేవత సోనియాగాంధీ అని, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవానికి ఎలా ఆహ్వానిస్తారో రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ కోసం ఎంతోమంది ప్రాణత్యాగాలు చేస్తుంటే.. ఆ తల్లిదండ్రుల కడుపుకోత చూడలేక తెలంగాణ చిన్నమ్మ సుష్మాస్వరాజ్ పార్లమెంట్‌లో గొంతెత్తారని గుర్తుచేశారు. తెలంగాణ కోసం ఒక్కరు కూడా బలి కావొద్దని, ప్రత్యేక తెలంగాణరాష్ట్రానికి బీజేపీ పూర్తి మద్దతు పలికిందన్నారు. తెలంగాణ కాంగ్రెస్ నాయకులు ఉద్యమాన్ని అణచివేయాలని చూశారని, ఆంధ్ర నాయకులకు అమ్ముడుపోయి తెలంగాణ బిడ్డల ప్రాణాలు పోయినా పదవులే ముఖ్యంగా గోడ మీద పిల్లుల్లా వ్యవహరించిన ఘనత కాంగ్రెస్ నాయకులదని ఆరోపించారు. ప్రత్యేక తెలంగాణ సాధనలో, ఉద్యమంలో కాంగ్రెస్ నాయకులు చేసిందేమీ లేదన్నారు.

కేసీఆర్ పదేళ్లు దోచుకుంటే.. రేవంత్..

తెలంగాణ పేరు చెప్పి కేసీఆర్ పదేళ్లు దోచుకుంటే.. ఇప్పుడు రేవంత్‌రెడ్డి (రేటెంతన్న) ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చి ఇంకా అప్పుల కుప్ప చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ ఆస్తులు అమ్మే పనిలో ఉన్నారని, తెలంగాణ సొమ్మంతా ఢిల్లీకి దోచిపెడుతున్నాడని మండిపడ్డారు. నగరంలో నిరుపయోగంగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్, పాత కలెక్టరేట్ మైదానం, స్పోర్ట్స్ స్టేడియం నిర్మాణం, డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపు, తదితర అంశాలపై కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతును కలిశానని తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే వాటి పరిష్కారానికి సహకరిస్తానని హామీనిచ్చినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి న్యాలం రాజు, కార్పొరేటర్లు మల్లేష్ యాదవ్, సుంకరి నారాయణ, మాస్టర్ శంకర్, ముత్యాలు, ఎర్రం సుధీర్, నాయకులు గడ్డం రాజు, ఇల్లందుల ప్రభాకర్, ఇప్పకాయల కిషోర్, బైకన్ మధు, పంచరెడ్డి శ్రీధర్, బద్దం కిషన్, తదితరులు పాల్గొన్నారు.

నేటి చిత్రం..



నాటడం.. నరకడం

నగరంలో వంద ఫీట్ల రోడ్డులో ఇరువైపులా హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కలు భారీగా పెరిగి కరెంటు తీగలకు అడ్డంగా వస్తున్నాయని ట్రాన్స్‌కో అధికారులు నరికివేస్తున్నారు. హరితహారం మొక్కలను వైర్ల కింద కాకుండా ఖాళీ ప్రదేశాల్లో నాటితే ఇలా నరికివేసే అవసరం ఉండదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్–నిజామాబాద్

యూనిఫామ్స్ సకాలంలో అందించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నేతలు

నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలను సకాలంలో అందించాలని ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అధికారి మురళీమనోహర కృష్ణకు నేతలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు మహేష్ మాట్లాడుతూ.. గత సంవత్సరం చాలా ప్రభుత్వ పాఠశాలలో కొంతమంది విద్యార్థులకు మాత్రమే యూనిఫాం, పుస్తకాలు అందాయని, పూర్తి స్థాయిలో అందకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. సమస్య పునరావృతం కాకుండా చూడాలని కోరారు. నగర అధ్యక్షులు గణేష్, నాయకులు వేణుగోపాలచారి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ, వైస్ ఎంపీపీ పదవులు ఏకగ్రీవం

- రెండు పదవులూ కాంగ్రెస్ కైవసం



ఎంపీపీ, వైస్ ఎంపీపీని సన్మానిస్తున్న ఎంపీటీసీలు, కాంగ్రెస్ నాయకులు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): డిచ్‌పల్లి ఎంపీపీగా చిన్నోల్ల నర్సయ్య, వైస్ ఎంపీపీగా దండుగుల సాయిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండు పదవులను కాంగ్రెస్ పార్టీ కై వసం చేసుకుంది. శుక్రవారం డిచ్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల అధికారి, జెడ్పీ డిప్యూటీ సీఈవో సుందర వరదరాజన్ నేతృత్వంలో ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నిక నిర్వహించారు. మండలంలోని మొత్తం 17 మంది ఎంపీటీసీలకు గానూ 13 మంది ఎంపీటీసీలు హాజరయ్యారు. కోరం ఉన్నందున ఎన్నికల కమిషన్ అనుమతి, కలెక్టర్ ఆదేశాల మేరకు ఎన్నిక నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు. ఎంపీపీగా నడిపల్లి – 2 ఎంపీటీసీ చిన్నోల్ల నర్సయ్య, వైస్ ఎంపీపీగా అమృతాపూర్ ఎంపీటీసీ దండుగుల సాయిలుకు మిగిలిన 11 మంది ఎంపీటీసీలు మద్దతు తెలుపడంతో వారిద్దరూ ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. తర్వాత ఎంపీపీ, వైస్ ఎంపీపీలకు నియామక పత్రాలు అందజేశారు. ఎంపీపీ, వైస్‌ఎంపీపీలతో ఎంపీడీవో రవీందర్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఎంపీపీ, వైస్‌ఎంపీపీలను ఎంపీడీవో రవీందర్, ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్ లు శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఎంపీపీగా నర్సయ్య, వైస్‌ఎంపీపీగా సాయిలు బాధ్యతలు స్వీకరించారు. గతంలో బీజేపీకి చెందిన ఎంపీటీసీలు గడ్డె భూమన్న ఎంపీపీగా, కులాచారి శ్యాంరావు వైస్ ఎంపీపీగా ఉన్నారు. ఎంపీటీసీలు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడంతో ఎంపీపీ, వైస్ ఎంపీపీ పదవులు ఖాళీ అయ్యాయి. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నిక ప్రక్రియ నిర్వహణకు సుమారు రెండు నెలల సమయం పట్టింది.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం: నగేశ్‌రెడ్డి

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని, పార్టీలో కష్టపడి పని చేసే కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్‌రెడ్డి అన్నారు. రానున్న రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి నేతృత్వంలో నియోజకవర్గం, డిచ్‌పల్లి మండలంలో అభివృద్ధి కొనసాగుతుందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు కార్యకర్తలు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. నూతనంగా ఎన్నికైన వారిని శాలువా, పూలమాలలతో నగేష్‌రెడ్డి, ఎంపీటీసీలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గంగాధర్, సొసైటీ చైర్మన్ రాంచందర్‌గౌడ్, తదితరులు సన్మానించి, అభినందనలు తెలిపారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

ఆర్మూర్‌టౌన్: వ్యాధులు రాకుండా ఉండేందుకు పరిసరాలను శుభ్రంగా ఉంచాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్ అన్నారు. పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో ఫ్రై డే డ్రై డే కార్యక్రమాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. ప్రతి ఒక్కరూ ఇంటి ఎదుట నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలని, అప్పుడే వ్యాధులు దరిచేరవని సూచించారు.

సాధారణ బోగీలను పెంచాలని విన్నపం



ప్రధానికి పంపనున్న ఉత్తరాలతో సాధన సమితి సభ్యులు

నిజామాబాద్‌నాగారం: ప్రతి రైలులో సాధారణ బోగీలను ఐదుకు పెంచాలని ప్రధానమంత్రి దివ్య సన్నిధికి కోటి ఉత్తరాల కార్యక్రమంలో భాగంగా రైలులో ఐదు సాధారణ బోగీల సాధన సమితి జాతీయ కన్వీనర్ డాక్టర్ పరికిపండ్ల అశోక్, పద్మశాలి సంఘం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు పులగం హన్మాండ్లు ఆధ్వర్యంలో కార్యక్రమాలను ప్రారంభించారు. పద్మశాలి సంఘం జిల్లా పట్టణ నాయకులు మద్దతు తెలిపి ప్రధానమంత్రికి స్వయంగా వంద ఉత్తరాలు రాశారు. సాధన సమితి జాతీయ కన్వీనర్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ మాట్లాడుతూ.. ఐదు సాధారణ బోగీల సాధన కోసం ప్రధాన మంత్రికి దేశవ్యాప్తంగా కోటి ఉత్తరాలను పంపుతూ గాంధీ మార్గంలో వివిధ ప్రాంతాల్లో ప్రజలను చైతన్యం చేస్తూ నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ప్రతిరోజు దేశవ్యాప్తంగా సుమారు 60 కోట్ల మంది రైళ్ల ద్వారా ప్రయాణిస్తున్నట్లు అనధికార అంచనా ఉండగా, ఈ ప్రయాణంలో జనరల్ బోగీల్లో ప్రయాణించే సామాన్యుల పరిస్థితి దయనీయంగా ఉందని, సీట్లు తక్కువగా ఉండటం, బోగీల్లో స్థలం లేకపోవడం, తొక్కిసలాటలు, గాయాలు, కొన్ని సందర్భాల్లో తీవ్ర గాయాలై చిన్నారుల ప్రాణాలు పోయిన సందర్భాలు కూడా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద రవాణా వ్యవస్థగా ఉన్నటువంటి భారతీయ రైల్వేలు సాధారణ పౌరునికి అందిస్తున్న సేవలు మాత్రం పేవలంగా ఉన్నాయన్నారు. నెల రోజుల క్రితం మహబూబాబాద్‌లో కోణార్క్ ఎక్స్‌ప్రెస్ ఎక్కుతూ ఒక స్త్రీ కిందపడి చంకలో ఉన్న పాపతో పాటు కడుపులో ఉన్న పిండాన్ని కూడా కోల్పోవడంతో కలత చెంది ఈ బృహత్తర కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ఇప్పటివరకు తెలంగాణలోని దాదాపు అన్ని జిల్లాల్లో చైతన్య సదస్సులు నిర్వహిస్తూ, ఇటీవలనే గుజరాత్ రాష్ట్రానికి వెళ్లి, అక్కడ కూడా పలు జిల్లాల్లో చైతన్య కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం, ఆంధ్రప్రదేశ్‌లోని 14 జిల్లాల్లో చైతన్య సదస్సులు నిర్వహిస్తూ పోస్ట్ కార్డు ఉద్యమాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ అంశాన్ని భారతదేశంలోని ప్రతి ఒక్కరూ ఒక సామాజిక బాధ్యతగా – టు, ది ప్రైమ్ మినిస్టర్, ప్రైమ్ మినిస్టర్ ఆఫీస్, 152 సౌత్ బ్లాక్, రైసినా హిల్స్,న్యూఢిల్లీ–110011 చిరునామాకు మన బాధను, డిమాండ్‌ను అభిప్రాయాల్ని తెలుపుతూ ఉత్తరం రాసి పంపాలని కోరారు. వివరాలకు 9989310141లలో సంప్రదించాలని తెలిపారు. సీనియర్ అడ్వకేట్ బసవ రాజేశ్వరరావు, నాయకులు గుజ్జేటి వెంకట నరసయ్య పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకంపై తనిఖీలు



మటన్ మార్కెట్ వద్ద తనిఖీలు చేస్తున్న ఇన్‌చార్జి ఎంహెచ్‌వో

నిజామాబాద్ నాగారం: ప్లాస్టిక్ కవర్ల వాడకం ఎక్కువైందని, వాటి వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని, ప్లాస్టిక్‌ను నిషేధించాలంటూ మున్సిపల్ శానిటేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా తనిఖీలు చేపట్టారు. శుక్రవారం నిజామాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. ముఖ్యంగా కూరగాయల మార్కెట్లు, చికెన్, మటన్ షాపుల్లో టిఫిన్స్, దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. వెంటనే ప్లాస్టిక్ కవర్లు వాడకం నిషేధించాలని వ్యాపారులకు సీరియస్‌గా ఆదేశాలిస్తున్నారు. మార్చుకోవాలని సమయం కూడా ఇస్తున్నారు. కేవలం 50 మైక్రాన్ మందం ఉన్న ప్లాస్టిక్ కవర్లనే ఉపయోగించాలి అధికారులు చెబుతున్నారు.

వాడితే కఠిన చర్యలు

ప్లాస్టిక్ కవర్లు నిషేధించాలంటూ ఈరోజు ప్రత్యేకంగా కూరగాయల మార్కెట్, మటన్, చికెన్, టిఫిన్ దుకాణాల్లో పరిశీలన చేస్తూ వ్యాపారులకు సూచనలు ఇచ్చాం. వారం రోజులలో మార్పు రాకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించాం.

– సాజిత్ అలీ, ఇన్‌చార్జి ఎంహెచ్‌వో

సమాచారం..

నేడు విద్యుత్ అంతరాయం

నిజామాబాద్‌నాగారం: అర్సపల్లి ఫీడర్ 11 కేవీ మరమ్మతులను దృష్టిలో ఉంచుకొని శనివారం ఉదయం 9 గంటల నుంచి 12 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ టౌన్–1 చంద్రశేఖర్ తెలిపారు. డైరీఫారం క్రాస్ రోడ్స్, సతీష్ నగర్, ధర్మపురి హిల్స్, మదీనా ఈద్గా, సీఎం రోడ్, కెనాల్‌కట్ట, సాయి లక్ష్మీనగర్, చోటా గోశాల ప్రాంతాలలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలన్నారు.

డీలర్లు నిబంధనలు పాటించాలి



సిరికొండ: విత్తనాలను విక్రయించడంలో డీలర్లు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని నిజామాబాద్ రూరల్ ఏడీఏ ప్రదీప్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల డీలర్లతో అవగాహన సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ.. వానాకాలం సీజన్ ప్రారంభమవుతున్నందున నకిలీ విత్తనాల నిర్మూలన గురించి వివరించారు. విత్తనాలను విక్రయించేటపుడు రైతులవారీగా రిజిస్టర్‌లో నమోదు చేయాలని, ప్రతి రోజు ఆ సమాచారాన్ని వ్యవసాయ అధికారులకు అందజేయాలని తెలిపారు. దుకాణాల్లో తప్పనిసరిగా స్టాక్ బుక్, రిజిస్టర్‌లు నిర్వహించాలని ఆదేశించారు. కంపెనీల నుంచి వచ్చిన విత్తనాలను మాత్రమే విక్రయించాలని, విడిగా విత్తనాలను విక్రయించరాదని, ఎవరైనా ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు అమ్మినట్లయితే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ హెచ్చరించారు. లైసెన్సు లేకుండా విత్తనాలు అమ్మినట్లయితే మాకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఏవో వెంకటేష్, ఏఈవోలు, డీలర్లు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	72,900	వెండి (కిలో)	91,500
22 క్యారెట్స్	67,247		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	200
		లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	24	40	గాజరుగడ్డ	30	50
బెండకాయ	25	50	పచ్చిమిర్చి	50	80
బీరకాయ	50	75	దోసకాయ	15	30
దొండకాయ	25	50	ఆలుగడ్డ	25	40
బీర్నిసుకాయ	100	130	గోబిగడ్డ	20	40
కాకరకాయ	40	60	గోబిపువ్వు	25	50
వంకాయ	20	40	బీట్‌రూట్	30	60
పాలకూర	15	30	కరివేపాకు	40	70
మెంతికూర	50	80	చామగడ్డ	40	70
కొత్తిమీర	40	60	గోరుచిక్కుడు	50	80
పుదీనా	60	80	చిక్కుడుకాయ	40	80
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-2	ఫ్యూరియస్ మ్యాడ్ మాక్స్ (తెలుగు)- 10.45, 1.45,7.40,10.40
	ఫ్యూరియస్ మ్యాడ్ మాక్స్-(ఇంగ్లీష్)-4.45
స్క్రీన్-3	రాజు యాదవ్(తెలుగు)- 1.45, 4.40, 10.30, ఆ ఒక్కటీ అడక్కు (తెలుగు) - 7.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	ఫ్యూరియస్ మ్యాడ్ మాక్స్ (తెలుగు)- 1.15, ఫ్యూరియస్ మ్యాడ్ మాక్స్ (ఇంగ్లిష్) - 4.30, 7.45, 11.00
స్క్రీన్-2	శ్రీకాంత్ (హిందీ) - 1.15, రాజు యాదవ్ (తెలుగు) - 4.15, ఫ్యూరియస్ మ్యాడ్ మాక్స్ (తెలుగు) - 6.55
స్క్రీన్-3	డర్టీ ఫ్లవర్ (తెలుగు) - 1.25, ఆ ఒక్కటీ అడక్కు (తెలుగు) - 4.05, శ్రీకాంత్ (హిందీ) - 7.00, సీడీ (క్రిమినల్ ఆర్ డెవిల్ (తెలుగు) - 10.00
స్క్రీన్ -4	బిగ్ బ్రదర్ (తెలుగు) - 11.25, సిల్క్ సారీ (తెలుగు) - 2.00, రాజు యాదవ్ (తెలుగు) - 7.50, 10.30
దేవి	రాజు యాదవ్
నటరాజ్	ఫ్యూరియస్ మ్యాడ్ మాక్స్ (తెలుగు)
విజయ్	లవ్‌మీ(తెలుగు)

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ విమల

జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి మండల సర్వసభ్య సమావేశాన్ని సాదాసీదాగా జరిగింది. ఎంపీపీ కుంచాల విమల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే సకాలంలో జీలుగ విత్తనాలు అందించాలని సభ్యులు కోరారు. త్వరలోనే రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తామని ఏవో దేవిక తెలిపారు. ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఈ సమావేశానికి ప్రధాన శాఖల అధికారులు సమావేశానికి హాజరు కాలేదు. ఆయా శాఖలలోని కింది స్థాయి సిబ్బంది వచ్చి సమావేశంలో శాఖల వివరాలను వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తిరుపతిరెడ్డి, ఎంపీడీవో కిరణ్‌కుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

త్వరితగతిన మరమ్మతులు చేపట్టాలి



పాఠశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

బోధన్/ రెంజల్/ ఎడపల్లి/ నవీపేట: పాఠశాలలు పునఃప్రారంభమవుతున్న నేపథ్యంలో మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల నిర్మాణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాలూర మండలంలోని తగ్గెల్లి, రెంజల్, నీలా, ఎడపల్లి మండలంలోని జానకంపేట, ఎమ్మెస్సీ ఫారం, బ్రాహ్మణపల్లి, నవీపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలను ఎమ్మెల్యే సందర్శించారు. పాఠశాలలో చేపట్టిన మరమ్మతు పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. ఆయా పాఠశాలల్లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రెంజల్ హైస్కూల్‌లో పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించడంపై హెచ్‌ఎం ఆంజనేయులును ఎమ్మెల్యే అభినందించారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే వెంట పార్టీ నాయకులు, అధికారులు ఉన్నారు.

మేస్త్రీలకు బీమా బాండ్ల పంపిణీ



బోధన్: తాపీ మేస్త్రీలకు రూ. లక్ష ఉచిత ప్రమాద బీమా బాండ్లను భారతి సిమెంట్ మేనేజర్ మిర్జా శుక్రవారం పంపిణీ చేశారు. పట్టణంలోని రాయల్ ట్రేడర్స్ దుకాణంలో తాపీ మేస్త్రీలతో సమావేశం నిర్వహించారు. సిమెంట్ వ్యాపారంలో భారతి సిమెంట్ తిరుగులేని సంస్థగా ఎదుగుతోందని ఆయన అన్నారు. టెక్నికల్ ఇంజినీర్ సాగర్‌రెడ్డి మాట్లాడుతూ.. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌తో పోల్చితే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగంగా పూర్తవుతుందని వివరించారు. సమావేశంలో డీలర్ జహీర్, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.